క్లుప్తంగా

కంప్యూటర్‌పై అవగాహన అవసరం



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఎంఈఓ

బుచ్చినాయుడుకండ్రిగ : ప్రభుత్వ పాఠశాల్లోని విద్యార్థులకు కంప్యూటర్‌పై అవగాహన అవసరమని ఎంఈఓ–2 మునిసుబ్రమణ్యం తెలిపారు. బుధవారం బీఎన్‌కండ్రిగ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 9 వ తరగతి విద్యార్థులకు కంప్యూటర్‌పై శిక్షణ ఇచ్చారు. పిల్లలకు కంప్యూటర్ నాలెడ్జ్ ప్రధానమని, ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రమణయ్య పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్‌కు మాతృవియోగం



కాంతమ్మకు నివాళులర్పిస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి : పట్టణంలోని 24వ వార్డు మాజీ కౌన్సిలర్ భీమాల మునికృష్ణ తల్లి కాంతమ్మ అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అక్కడికి చేరుకుని ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు ఉదయ్‌కుమార్, శరవణకుమార్, పాలకమండలి మాజీ సభ్యులు మున్నా రాయల్, సురేష్, ఆశా కిరణ్, కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

అబాకస్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

శ్రీకాళహస్తి: విశ్వం విద్యా సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి అబాకస్ పోటీల్లో శ్రీకాళహస్తి విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. ఆర్‌సీపీ గురుకులం 7వ తరగతి విద్యార్థి సునీల్ ద్వితీయ బహుమతి సాధించాడు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్ 4వ తరగతి విద్యార్థిని లాస్య జూనియర్ లెవల్ వన్‌లో గెలుపొందింది. బుధవారం ఈ మేరకు విద్యార్థులను ఢిల్లీ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ ఢిల్లీబాబు అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుప్రజ, ఉపాధ్యాయులు నాగేశ్వరి, షకీలా, బాబు, ప్రశాంత్, అరుణ, రేవతి పాల్గొన్నారు.

సీఆర్‌ఎస్‌లో వైద్య శిబిరం



పరీక్షిస్తున్న వైద్యులు

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట) : రేణిగుంట సీఆర్‌ఎస్‌లో బుధవారం ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రి వారు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ మేరకు పెన్షనర్లకు వైద్య పరీక్షలు చేపట్టి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఆర్‌ఎస్ చీఫ్ వర్క్‌షాపు మేనేజర్ దేవసేనం, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జనార్దన్, సీఆర్‌ఎస్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేందర్ రెడ్డి, సెక్రటరీ విజయ్ కుమార్, ట్రెజరర్ గజపతి నాయుడు, కృష్ణమూర్తి రెడ్డి పాల్గొన్నారు.

నిందితుల అరెస్టుకు డిమాండ్

సత్యవేడు: మండలంలోని ఓబులరాజు కండ్రిగ ఆటో డ్రైవర్ ఎస్.లక్ష్మయ్య మృతికి కారకులైన నిందితులు జగదీష్, భాస్కర్ రాజును వెంటనే అరెస్టు చేయాలని సీపీఎం, సీఐటీయూ, కేవీపీఎస్ నేతలు డిమాండ్ చేశారు. బుధవారం ఈ మేరకు ఆటో డ్రైవర్లతో కలిసి పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టారు. సీపీఎం జిల్లా కార్యదర్శి సభ్యుడు దాసరి జనార్దన్ మాట్లాడుతూ లక్ష్మయ్యను కొట్టి చంపిన వారిని అరెస్టు చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు మునస్వామి, కృష్ణయ్య, బాబు, అలిమేలు, మంజుల, పుష్ప, గౌరి పాల్గొన్నారు.

ఘనంగా ఫేర్‌వెల్ డే

సత్యవేడు : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఘనంగా ఫేర్‌వెల్ డే నిర్వహించారు. విద్యార్థినులు నృత్యాలతో సందడి చేశారు. ప్రిన్సిపల్ జగన్‌మోహన్‌ఆచార్యులు మాట్లాడుతూ ప్రణాళికతో చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. అనిల్ కుమార్, శివరాం, రాజేష్, సలీం. సురేష్‌కుమార్, సుధీర్ కుమార్, కృష్ణవేణి, గీత, సిబ్బంది సుబ్రమణ్యం, వెంకటేష్, కృష్ణ పాల్గొన్నారు.

మద్యంతో జీవితాలు ఛిద్రం

రేణిగుంట : మద్యానికి బానిసలుగా మారి జీవితాలను ఛిద్రం చేసుకోవద్దని డీఎస్పీ శ్రీనివాసరావు సూచించారు. బుధవారం ఏర్పేడు మండలం పాపానాయుడుపేటలోని రాస్–ఐఆర్‌సీపీ డీ–అడిక్షన్ సెంటర్‌లో ఉన్న వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు.



మామిడితోటలో వేరుశనగ



నిమ్మ చెట్ల నడుమ మినుము

అంతరంగంలో ఆదాయం!

వ్యవసాయమే ప్రధాన ఆదాయ వనరుగా బీఎన్ కండ్రిగ మండలంలోని రైతులు ముందడుగు వేస్తున్నారు. వినూత్న విధానాలను అవలంభిస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. మామిడి.. నిమ్మ.. పామ్ తదితర తోటల్లో అంతర పంటలు సాగు చేస్తూ ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు. తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం పొందుతున్నారు. అగ్రికల్చర్ అధికారుల సలహాలను అందిపుచ్చుకుని ఉత్సాహంగా సేద్యం చేస్తున్నారు.

- మామిడి, నిమ్మ, పామ్ తోటల్లో ఇతర పంటలు
- తక్కువ ఖర్చుతో అధిక లాభాలు
- విస్తారంగా సాగు చేస్తున్న రైతులు

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని రైతులు విస్తారంగా అంతర పంటలను సాగు చేస్తున్నారు. మామిడి, నిమ్మ తోటల్లో మిరప, మినుము, వేరుశనగ, మిరపలో ఉల్లిని అంతర పంటలుగా వేస్తున్నారు. సుమారు 70 ఎకరాల మామిడి, 10 ఎకరాల నిమ్మతోటల్లో అంతర పంటల సాగు చేపట్టారు. మిరప, మినుము, వేరుశనగ ఆరుతడి పంటలు కావటంతో నీటి ఖర్చు తక్కువగా ఉంటుంది. నిమ్మ, మామిడి చెట్లకు వాడే నీటితోనే వీటిని పండించుకోవచ్చునని, దీంతో విద్యుత్ ఆదా అవుతుందని రైతులు తెలియజేస్తున్నారు. అలాగే పంట దిగబడి సైతం బాగా వస్తుందని, మిరప, మినుము, వేరుశనగకు వాడే ఎరువులతో నిమ్మ, మామిడి చెట్లకు పోషకాలు అందుతాయని వెల్లడిస్తున్నారు. అలాగే పామ్ తోటల్లో సైతం మినుము సాగు చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నట్లు వివరిస్తున్నారు. ఆయా తోటల్లో సుమారు 5 ఏళ్లపాటు అంతర పంటలు సాగు చేసుకోవచ్చని వ్యవసాయశాఖ అధికారులు సైతం తెలియజేస్తున్నారు. తాము అందించే సలహాలను రైతులు అందిపుచ్చుకుని ఆదాయ మార్గంలో పయనిస్తున్నట్లు చెబుతున్నారు. ఈ క్రమంలోనే ప్రభుత్వం సైతం ప్రోత్సాహకాలు అందించాలని అన్నదాతలు కోరుతున్నారు.



మిరపలో అంతరపంటగా ఉల్లి



పామ్ తోటలో మినుము

ప్రజారోగ్య రక్షణే లక్ష్యం



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ బాలకృష్ణ నాయక్

నారాయణవనం: ప్రజారోగ్య రక్షణే లక్ష్యంగా వైద్య సిబ్బంది విధులు నిర్వర్తించాలని డీఎంహెచ్‌ఓ బాలకృష్ణ నాయక్ ఆదేశించారు. బుధవారం స్థానిక పీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి, సిబ్బందితో సమీక్షించారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ఫీవర్, ఫైలేరియా, క్యాన్సర్ నిర్ధారణపై చేపట్టిన సర్వేల నివేదిక ఆధారంగా బాధితులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో 104 సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌ఓ శ్రీనివాసులు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి శాంత కుమారి, పద్మావతి, డాక్టర్ రాగసుధ పాల్గొన్నారు.

బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం



నిరసన తెలుపుతున్న వామపక్ష నేతలు



కేవీబీపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద..

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని వామపక్ష పార్టీల నేతలు తులసిరాజన్, హరనాథ్ మండిపడ్డారు. బుధవారం రేణిగుంట అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. నిధులు సాధించడంలో విఫలమైన రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ లేబర్ కోడ్ ఉపసంహరణకు కార్మికులు ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. బీహార్ సీఎం నితీష్‌కుమార్‌ను చూసి ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ బుద్ధి తెచ్చుకోవాలని సూచించారు. వెంటనే బీజేపీతో పొత్తు విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వామపక్ష నేతలు కె.ఈశ్వరమ్మ, సెల్వరాజ్, దిలీప్ భాషా, కృష్ణ,మునస్వామి, పద్మమ్మ, శివ, నాగూర్ బాషా, విజయ్, ఆశీర్వాదం, రమణయ్య పాల్గొన్నారు.

బడ్జెట్ ప్రతుల దహనం

సత్యవేడు: స్థానిక గాంధీ విగ్రహం సమీపంలో కేంద్ర బడ్జెట్ ప్రతులను పలు సంఘాల నేతలు దహనం చేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దాసరి జనార్దన్ మాట్లాడుతూ ఎన్‌డీఏ ప్రభుత్వం రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందని మండిపడ్డారు. విభజన హామీలు, ప్రత్యేకహోదా ఊసే లేదని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు, అమరావతి రాజధాని నిర్మాణానికి అరకొరగా నిధులు కేటాయించారని ఆరోపించారు. లేబర్ కోడ్ తీసుకువచ్చి రైతులు, కార్మికుల మనుగడను ప్రశ్నార్థకం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నేతలు కృష్ణయ్య, శ్రీను, బాబు, మోహన్‌బాబు, శేఖర్, అంకయ్య, దినేష్, పుష్ప, విద్య, అలిమేలు తదితరులు పాల్గొన్నారు.

కేవీబీపురం (వరదయ్యపాళెం): బడ్జెట్‌లో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదని సీఐటీయూ మండల కార్యదర్శి నాగలాపురం నాగరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీఎం, సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కేవీబీపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు.బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలోశంకరయ్య, బుజ్జమ్మ, మురుగయ్య పాల్గొన్నారు.

ఆక్రమణలపై విచారణకు డిమాండ్

సత్యవేడు: మండలంలోని కొత్తమారికుప్పం రెవెన్యూలో భూ ఆక్రమణలపై సమగ్ర విచారణ చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్నిరాజ్ డిమాండ్ చేశారు. బుధవారం ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ టీవీ సుబ్రమణ్యానికి వినతిపత్రం అందించారు. చిన్నిరాజ్ మాట్లాడుతూ కొత్తమారికుప్పం సర్వే నంబర్ 300 నుంచి 386 వరకు ఉన్న సుమారు 350 ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు వెల్లడించారు. రెవెన్యూ సిబ్బందితో కబ్జాదారులు కుమ్మక్కై ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకుని పాసు పుస్తకాలు పొందినట్లు ఆరోపించారు. ఆక్రమిత భూమిలో మామిడి, తైలం చెట్లు సాగుచేస్తున్నట్లు తెలిపారు. విచారణ చేసి పేదలకు పంపిణీ చేయాలని కోరారు. ఎంపీటీసీ సభ్యుడు మోహన్ రెడ్డి, పురుషోత్తం పాల్గొన్నారు.

గైనకాలజిస్ట్ నియామకానికి వినతి

సత్యవేడు: స్థానిక కమ్యూనిటీ వైద్యశాలలో గైనకాలజిస్టును నియమించాలని ఎంపీటీసీ మాజీ సభ్యులు మోహన్ బాబు, వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం ఆస్పత్రి తనిఖీకి విచ్చేసిన డీసీహెచ్‌ఎస్ ఆనంద మూర్తికి వినతిపత్రం అందించారు. గైనకాలజిస్ట్ లేకపోవడంతో గర్భిణులు తీవ్రంగా ఇబ్బందిపడుతున్నారని, ప్రసవానికి దూరప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని వెల్లడించారు. అలాగే డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించారు.డాక్టర్లు సురేష్, రమేష్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి శాంతకుమారి, టీబీ లెప్రసీ అధికారి శ్రీనివాసులు రెడ్డి, ఆర్‌బీఎస్‌కే అధికారి పద్మావతి, సాహైల్ అహ్మద్, లావణ్య, ప్రేమ, సురేఖ, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

నేటి నుంచి గోవిందరాజస్వామి తెప్పోత్సవాలు

తిరుపతి కల్చరల్ : శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో గురువారం నుంచి ఈనెల 12వ తేదీ వరకు తెప్పోత్సవాలు నిర్వహించనున్నారు. ప్రతి రోజు సాయంత్రం 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు స్వామివారు దేవేరులతో పుష్కరిణిలో తెప్పలపై విహరిస్తూ భక్తులకు దర్శనమివ్వనున్నారు. అనంతరం ఆలయ మాడ వీధుల్లో ఊరేగుతూ దర్శనమివ్వనున్నారు. తెప్పోత్సవాల్లో భాగంగా తొలి రోజు శ్రీకోదండరామస్వామి, 7వ తేదీ శ్రీరుక్మిణి సత్యభామ సమేత శ్రీపార్థసారథిస్వామి వారు, 8వ ఆండాళ్ అమ్మవారితో కలిసి శ్రీకృష్ణస్వామి వారు, 10, 11,12వ తేదీల్లో శ్రీగోవిందరాజస్వామి వారు తెప్పలపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించనున్నారు. చివరి రోజు ఆంజనేయస్వామి వారి సన్నిధికి స్వామివారు వేంచేపు చేయనున్నారు.

వైభవంగా కుంభాభిషేకం



ఆలయంలో నూకతోటి రాజేష్

నాగలాపురం: మండలంలోని ఎస్‌ఎస్ పురంలో నూతనంగా నిర్మించిన వెంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం వైభవంగా కుంభాభిషేకం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయ కర్త నూకతోటి రాజేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆలయ నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు బీరేంద్రవర్మ, భాను ప్రకాష్ రెడ్డి, వైస్ ఎంపీపీ దానివేలు, సచివాలయ కన్వీనర్ దేశప్పన్, చెల్లయ్య పాల్గొన్నారు.

శివరాత్రి పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న శేఖర్‌రెడ్డి

వరదయ్యపాళెం: మండలంలోని సంతవేలూరులో వెలసిన శ్రీ కామాక్షి సమేత వాలీశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాల పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఆలయ ధర్మకర్త శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సత్యనారాయణరెడ్డి, బాబురెడ్డి, లక్ష్మీప్రసాద్‌రెడ్డి, పరంధామరెడ్డి, బాలయ్య, సుధాకర్, రమేష్, మద్రెయ్య పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించకుంటే చర్యలు



కొలతలు తీస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని నాలుగు మాడవీధుల్లో ఆక్రమణలు తొలగించకుంటే చర్యలు తప్పవని ఆర్‌డీఓ భానుప్రకాష్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ఈ మేరకు ఆక్రమణలను గుర్తించి మార్కింగ్ వేశారు. ఆర్‌డీఓ మాట్లాడుతూ దుకాణదారులు రోడ్ల పైకి చొరబడటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. మహాశివరాత్రి లోపు దుకాణదారులు స్వచ్ఛందంగా ఆక్రమణలను తొలగించుకోవాలని సూచించారు. డీఎస్పీ నరసింహమూర్తి, సీఐ గోపి, మున్సిపల్ కమిషనర్ గిరికుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధికే అధిక ప్రాధాన్యం



సీసీరోడ్డును ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే

నారాయణవనం : జిల్లాలో అభివృద్ధి పనులకే అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, శంకుస్థాపనల్లో ఎమ్మెల్యే ఆదిమూలంతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. రూ 10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఎస్సీ వసతి గృహం వరకు నిర్మించనున్న సీసీ రోడ్డుకు భూమి పూజ చేశారు. పాలమంగళం ఉన్నత పాఠశాలలో పీఎంశ్రీ పథకం కింద నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులను తనిఖీ చేశారు.


నాణ్యతా ప్రమాణాల మేరకు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులు, అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. మెనూ ప్రకారం పిల్లలకు భోజనం వడ్డించాలని స్పష్టం చేశారు. పాఠశాల మైదానంలో మినీ స్టేడియం, 400 మీటర్ల రన్నింగ్ ట్రాక్, జిమ్ ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులు విన్నవించగా సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ భానుప్రకాష్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సుమన్‌కుమార్, ఇన్‌చార్జి డిప్యూటీ డీఈఓ ప్రభాకర్‌రాజు పాల్గొన్నారు.

కాజ్‌వే పరిశీలన

నాగలాపురం: మండలంలోని కారూరు మార్గంలో ద్వారక నగర్ వద్ద దెబ్బతిన్న కాజ్‌వేలు కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే ఆదిమూలం పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ రూ.12కోట్ల వ్యయంతో వంతెన నిర్మాణానికి టెండర్లు పిలిచామని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. అనంతరం సురుటుపల్లెలోని పళ్లికొండేశ్వరుని ఆలయం సందర్శించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవ ఏర్పాట్లను సమీక్షించారు. ఆలయం వద్ద సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఆర్‌డీఓ భానుప్రకాష్‌రెడ్డి, తహసీల్దార్ హనుమాన్ నాయక్, ఆలయ ఈఓ లత, పంచాయతీ ఈఓ రమేష్‌చంద్ర, వీఆర్‌ఓ నాగభూషణం, పిచ్చాటూరు ఎస్‌ఐ– వెంకటేష్ పాల్గొన్నారు.

మృతదేహం కోసం స్విమ్స్ వద్ద ధర్నా

తిరుపతి తుడా/నారాయణవనం: తండ్రి మృతదేహాన్ని తమకు కాకుండా తొలి భార్యకు నిబంధనలకు విరుద్ధంగా అప్పగిస్తున్నారంటూ రెండో భార్య కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు తిరుపతి స్విమ్స్ వద్ద బుధవారం రాత్రి బైఠాయించి ధర్నా చేశారు. నారాయణవనం మండలం చిత్తూరుకండ్రిగకు చెందిన రిటైర్డ్ ట్రాన్స్‌కో డీఈ సుబ్రమణ్యం(80) రెండో భార్య కుమారుడు నవీన్, గ్రామస్తుల కథనం మేరకు.. సుబ్రమణ్యంకు పద్మతో వివాహమైంది. ఇద్దరు పిల్లలు పుట్టిన తరువాత పద్మ భర్త నుంచి విడిపోయి వేరుగా ఉంటోంది. సుబ్రమణ్యం చిత్తూరుకండ్రిగకు చెందిన జానకిని రెండో వివాహం చేసుకుని 30 ఏళ్లుగా తిరుపతిలో ఉంటున్నాడు. మూడేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్న సుబ్రమణ్యంకు రెండో భార్య జానకి, ఆమె కుమారుడు నవీన్‌లే స్విమ్స్‌లో చికిత్స చేయిస్తున్నారు. తీవ్ర అనారోగ్యానికి గురైన సుబ్రమణ్యంను జానకి, నవీన్‌లు మంగళవారం సాయంత్రం స్విమ్స్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ బుధవారం సుబ్రమణ్యం మృతి చెందాడు. ఈ సమాచారాన్ని మొదటి భార్య పద్మకు చేరవేశారు. సుబ్రమణ్యం అంత్యక్రియలను స్వగ్రామంలో ఇరు కుటుంబాలు కలిసి చేసుకోవాలని బంధుమిత్రులు సూచించారు. మృతదేహం తమకే అప్పగించాలని మొదటి భార్య పట్టుబట్టింది. సీఎం పేషీ నుంచి ఫోన్ వచ్చిందంటూ స్విమ్స్ డైరెక్టర్ పీఏ చెప్పడంతో మృతదేహాన్ని పద్మకు అప్పగించడానికి సిద్ధమయ్యారు. దీంతో నవీన్ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, మిత్రులు బుధవారం రాత్రి ధర్నాకు దిగారు. కంటికి రెప్పలా కాపాడుకుంటున్న తన తండ్రి వదిలేసి వెళ్లిపోయిన మొదటి భార్యకు మృతదేహాన్ని ఎలా అప్పగిస్తారని ప్రశ్నించారు. మృతదేహం కోసం సీఎం పేషీ నుంచి ఫోన్ వచ్చిందంటూ నిబంధనలకు విరుద్ధంగా ఎలా అప్పగిస్తారని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. అడ్మిట్ చేసిన తమకే అప్పగించాలని డిమాండ్ చేస్తున్నారు.





అధ్వాన్నం





కాళమనాయుడుపేట వద్ద..

సత్యవేడు-కదూరు కూడలి ప్రధాన రోడ్డు గుంతలమయంగా మారింది. కనీసం మరమ్మతులకు కూడా నోచుకోకుండా అధ్వాన్నంగా తయారైంది. సంక్రాంతి నాటికి రహదారులను అద్దంలా మెరిపిస్తామన్న హామీ నీటిమూటగా మిగిలిపోయింది. పాలకుల వంచనతో ప్రజానీకం ఇబ్బందిపడుతోంది. ఛిద్రమైన కల్వర్టులు.. రోడ్లపై రాకపోకలు సాగించేందుకు నానా అవస్థలు పడుతోంది. - వరదయ్యపాళెం

ప్రమాదకరం



ఏర్పేడు మండలం పాగాలి సమీపంలోని ఓ ప్రైవేటు ఫ్యాక్టరీ ముందు, సీతారాంపేట సమీపంలోని ఓ చౌకదుకాణ సరుకుల గోడౌన్ ముందు రోడ్డుపైనే లారీలు పార్క్ చేస్తున్నారు. దీంతో పలువురు వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా రాత్రివేళల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. సమీపంలోకి వస్తే కానీ నిలిపి ఉన్న భారీ లారీలు కనిపించక పోవడం ప్రాణాలమీదకు తెస్తోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

- రేణిగుంట (ఏర్పేడు)